మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
ఆదివారం | 27 | ఆగస్టు | 2023 | పేజీలు : 9


స్పష్టమైన తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలి కరీంనగర్ కలెక్టర్ గోపి



2లో

# నీలి విప్లవంతో దిగుమతి స్థాయి నుండి

# ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం

## తెలంగాణ సాధించుకున్నాక కులవృత్తులకు న్యాయం జరిగింది

## మంత్రి గంగుల కమలాకర్

## ఎల్ఎండిలో చేప పిల్లల విడుదల



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 26 (మనం న్యూస్)ః నీలి విప్లవంతో దిగుమతి స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం ఎల్ ఎం డి జలాశయంలోని గంగమ్మ దేవాలయం వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సమైక్య పాలనలో కుల వృత్తులు ధ్వంసమయ్యాయన్నారు. కులవృత్తులను కాపాడేందుకు కెసిఆర్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నాయి బ్రాహ్మణులకు ఉచిత కరెంటు, యాదవులకు గొర్రెలు, ముదిరాజ్ లకు ఉచితంగా చేపల పంపిణీ, 5 లక్షల బీమా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నీలి విప్లవం తీసుకువచ్చి ముదిరాజ్ ల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. 2014 నుండి 2023 వరకు కరీంనగర్ జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో 10 కోట్ల 45 లక్షల విలువ చేసే 12 కోట్ల 35 లక్షల చేప పిల్లలు విడుదల చేశామని, 9 సంవత్సరాల కాలంలో 29627.52 లక్షల విలువ చేసే 49 వేల 379 టన్నుల దిగుబడి వచ్చిందని మంత్రి వివరించారు. లోయర్ మానేరు జలాశయంలో ప్రతి సంవత్సరం 30 లక్షల చేప పిల్లలు విడుదల చేస్తామని, ఇప్పటి వరకు 3 కోట్ల 43 లక్షల రూపాయల విలువ చేసే కోటి 55 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేస్తే 4,676 లక్షల విలువ చేసే 7,793 టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. చేపల దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ చేరుకుందన్నారు. దురదృష్టవశాత్తూ మరణించిన మత్స్య కారుల కుటుంబాలకు 5 లక్షల ప్రమాద భీమా, అంగవైకల్యం చెందిన వారికి 2 లక్షల రూపాయలు ఇస్తున్నామన్నారు. సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గి, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వలసలు పెరిగాయని గంగుల తెలిపారు. ఈ మత్స్య సంపదను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో బండి సంజయ్



6లో

# కెసిఆర్ గుప్పిట్లో మీడియా సంస్థలు

## బిజెపి వార్తలు రాకుండా కుట్రలు

## సోషల్ మీడియానే నా నిజాయితీని, నిబద్ధతను చాటుతోంది

## ఎన్నికలయ్యే వరకు సోషల్ మీడియా మరింత చురుగ్గా ఉండాలి

## బిజెపి అధికారంలోకి రాకపోతే..

## తెలంగాణ మరో పశ్చిమబెంగాల్ అవుతుంది

## బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 26 (మనం న్యూస్)ః సిఎం కెసిఆర్ గుప్పిట్లోనే చాలా మీడియా సంస్థలు ఉన్నాయని, వాస్తవాలు బయటకు రాకుండా, బిజెపి వార్తలకు ప్రాధాన్యతనివ్వకుండా కుట్ర చేస్తున్నారని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. అయినప్పటికీ తన నిజాయితీ, నిబద్ధతను కాపాడుతోంది సోషల్ మీడియానే అని చెప్పారు. కరీంనగర్ ఎంపిగా గెలిపించిన ప్రజలు తనకు పేదల సమస్యలపై పోరాడుతూ హిందుత్వాన్ని జనంలోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. వారి అభీష్టానికి అనుగుణంగానే పార్లమెంటులో కూడా హిందుత్వ అంశాన్ని ప్రస్తావించేందుకు తాను వెనుకాడలేదన్నారు. కరీంనగర్

మిగతా 2లో..

# స్పష్టమైన తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 26 (మనం న్యూస్): జిల్లాలో స్పష్టమైన తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. గోపి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్ పరిధి కొంకటి వాడలోని ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కరీంనగర్ ఆర్డీఓలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల కొరకు జిల్లాలో పటిష్టమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్తను సేకరించే సానిటేషన్ వాహనాల ద్వారా స్పెషల్ క్యాంపెయిన్ డే ను గురించి ప్రజలకు తెలియజేసేలా వాయిస్ ఓవర్ లను రూపొందించి ప్రచారం చేయించాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డే లు నిర్వహించే చోట బ్యానర్లను ఏర్పాటు చేయాలని, ఓటరు జాబితాలో ఫోటో, ఇతర మార్పులు ఉన్నట్లయితే వాటిని ఫామ్-8 ద్వారా ఓటర్లతో నమోదు చేయించేలా బిఎల్ఓ లు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం నూతన ఓటర్ల నమోదు పత్రాలను పరిశీలించారు. అక్టోబర్ 1,2023 నాటికి 18 సంవత్సరాలు నిండిబోయే వారందరూ ఓటల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. 27వ తేదీతో పాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ ఆర్డిఓ కె. మహేశ్వర్, తహసీల్దార్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో

## శ్రావణమాసం ప్రత్యేక పూజలు



చిగురుమామిడి, ఆగస్టు 26 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆలయ అర్చకులు శేషం సత్యనారాయణ చార్యులు, శేషం శ్రీనివాసచార్యులు ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శనివారం కావడంతో ఉమ్మడి పాత కరీంనగర్ జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట జిల్లా హుస్నా బాద్ కు చెందిన తిరుమల తిరుపతి దేవస్థానము భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారి భక్తి పాటలతో భజన నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులను శాలువాలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందె సంపత్, ఆలయ అధికారిణి బూట్ల కవిత,ఆలయ ధర్మకర్త బొల్లబత్తిని మహేష్,మాజీ డైరెక్టర్ ఏనగందుల అశోక్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### దశాబ్దివనం లక్ష్యాన్ని పూర్తి చేశాం

## కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 26 (మనం న్యూస్): స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కోటి మొక్కల దశాబ్దివనం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించామని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన పాఠశాల ఆవరణలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్, పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్ నగర్ పట్టణం ఆదర్శ నగర్ లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కోనేరు కోనప్ప, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావులతో కాగజ్ నగర్ మండలంలోని వంజరి గ్రామపంచాయతీ పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ గుప్పిట్లో మీడియా సంస్థలు

మొదటి పేజీ తరువాయి..

లోని రేకుర్తిలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సోషల్ మీడియా వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బండి సంజయ్ తోపాటు అసోం ఎమ్మెల్యే దిగంత కలిత, పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, మధుకర్, వెంకటరమణ, బోయినిపల్లి ప్రవీణ్ రావు, మల్లేశం తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ గురించి ప్రజల్లో చర్చనే జరగడం లేదని చెప్పారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఇంకా సజీవంగా ఉన్నాయన్నారు. బిజెపి గ్రాఫ్‌ను తగ్గించేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ ను పెంచే కుట్రకు తెరదీశారని ఆరోపించారు. ఇందులో భాగంగా కొంతమందితో కలిసి తనపై అవినీతి ఆరోపణలు చేయడం ద్వారా బిజెపి గ్రాఫ్ ను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. గ్రానైట్ సంస్థల వద్ద డబ్బులు తీసుకున్నానని, వేల కోట్లు సంపాదించాననే ఆరోపణలు అందులో భాగమేనన్నారు. తాను గ్రానైట్ సంస్థల అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు చేయడంతోనే ఈడీ విచారణ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలొస్తున్న నేపథ్యంలో బిజెపి వార్తలు రాకుండా కెసిఆర్ కుట్రలు పన్నే ప్రమాదముందని సంజయ్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ భయపడే ప్రసక్తే లేదని, సోషల్ మీడియా ఆయుధంగా జనంలోకి వెళతామన్నారు. ఎన్నికల వరకు సోషల్ మీడియా మరింత అప్రమత్తంగా ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను, మోసపూరిత హామీలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరగనేలేదని, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న ప్రవాసీ ఎమ్మెల్యేలు సైతం ఇదే మాట చెబుతున్నారని తెలిపారు. అయినప్పటికీ కేసీఆర్ కావాలనే కాంగ్రెస్ గ్రాఫ్ పెంచడం ద్వారా బీజేపీని దెబ్బతీసే కుట్రకు తెరదీశారన్నారు. ఈసారి బిజెపిని అధికారంలోకి తీసుకురాలేకపోతే పార్టీ కార్యకర్తలను బతకనీయరని, బెంగాల్ లో మాదిరిగా అరాచకాలు సృష్టిస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలొస్తున్నందున రాబోయే రోజుల్లో కేసీఆర్ మరిన్ని కుట్రలు, దాడులకు తెరదీసే అవకాశముందని, అప్రమత్తంగా ఉంటూ కేసీఆర్ మోసాలను, కుట్రలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తాను కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే పర్యటిస్తూ కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా కొట్లాడతానని చెప్పారు.

# పల్లెల్లో పచ్చదనం ఉట్టి పడాలి

### ఎంపిపి మమత, జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్

జమ్మికుంట, ఆగస్టు 26 (మనం న్యూస్ ): చెట్లు చేమలతో పల్లెల్లో పచ్చదనం ఉట్టి పడాలని ఎంపిపి దొడ్డే మమత ప్రసాద్, జడ్పిటిసి సభ్యులు డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ అన్నారు.జమ్మికుంట మండలం పెద్దంపల్లి, మాచనపల్లి,



బిజిగిరి షరీఫ్ గ్రామపంచాయతీల పరిధిలో ఒక్కరోజు కోటి మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మమత, శ్రీరాంశ్యాంలు మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణ కోసం అనేక నిధులు కేటాయించిందన్నారు. జమ్మికుంట మండలంలో దాదాపు అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి అనేక రకాల మొక్కలను సంరక్షించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కల పెంచడంలో విజయం సాధించారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజీ షరీఫ్ సర్పంచ్ రాచపల్లి సదయ్య, ఎంపీటీసీ సభ్యులు రాచపల్లి రాజయ్య, ఎంపిఓ సతీష్ రావు, కార్యదర్శి రాజేందర్, టెక్నికల్ అసిస్టెంట్ కవిత, నయీమ్, రమేష్,ఎర్ర రాజు, వార్డు సభ్యులు, గ్రామ సర్పంచులు బొజ్జం కల్పన, ఇల్లందుల అన్నపూర్ణ, ఎంపీటీసీ పోల్సాని రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# సోదరభావం పవిత్రతతే రక్షాబంధన్ సందేశం

### బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 26 (మనం న్యూస్): ప్రతి ఒక్కరూ సోదరభా వంతో మెదలాలనే సందేశాన్ని తెలియజేయడమే రక్షాబంధన్ ఉద్దేశ్యమని ప్రజాపిత బ్రహ్మకుమారీ హుజురాబాద్ కేంద్ర నిర్వాహకురాలు ప్రణీత , జమ్మికుంట కేంద్ర నిర్వాహకురాలు నిర్మల అన్నారు. శనివారం రాఖీ పండగ విశిష్టతను వివరిస్తూ పట్టణంలో పలువురికి రాఖీలు కట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన మన దేశంలో ప్రతి పండుగ పరమాత్ముని అవతరణ, దివ్య కర్తవ్యాన్ని





సూచిస్తుందన్నారు. రక్షణ అంటే విలువలను పెంపొందించుకోవడం, మనం ఏర్పరచుకున్న విలువలను కాపాడుకుంటూ జీవించడం అన్నారు. పరస్పర మాటలు, దృష్టి స్వభావ సంస్కారాలు నిష్కల్మషంగా ఉండాలనే రాఖీ కట్టి మిఠాయి తినిపిస్తారని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జ్ డివి నాగేశ్వరరావుకు, స్థానిక సిఐ బొల్లం రమేష్ తో పాటు సిబ్బందికి, పోస్ట్ ఆఫీస్ మేనేజర్ మహేందర్ తో పాటు సిబ్బందికి రాఖీలు కట్టారు. పట్టణంలోని సబ్ జైలులో జైలర్ గణేష్ కు సిబ్బందికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# చల్మెడపై కాంగ్రెస్ నేతలు అసత్యపూరిత వ్యాఖ్యలు మానుకోవాలి

**- 33 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న కుటుంబం చల్మెడది**

**- కాంగ్రెస్ నాయకులపై బిఆర్ఎస్ శ్రేణుల మండిపాటు**

వేములవాడ టౌన్, ఆగస్ట్ 26 (మనం న్యూస్): చల్మెడపై కాంగ్రెస్ నేతలు అసత్యపూరిత వ్యాఖ్యలు మానుకోవాలని వేములవాడ పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండి పడ్డారు. శనివారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ యువ నాయకుడు సుంకపాక రాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. చల్మెడపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలన్నీ పచ్చి అబద్దాలని, మల్కాపేట ముద్దుబిడ్డగా గత 33 ఏళ్లుగా ప్రజా జీవితంలో, ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న గొప్ప కుటుంబం 'చల్మెడ' వారిదన్నారు. అలాంటి వారి చరిత్రపై కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందినప్పటికి, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి సిరిసిల్ల నియోజకవర్గానికి దీటుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లు చల్మెడకి టికెట్ కేటాయించడం జరిగిందని, ఆయన నాయకత్వంలోనైతేనే నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తుందని, పూర్తిస్థాయి నమ్మకంతోనే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ క్రమంలోనే తమ నాయకుడు ఇప్పటికే నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజాసేవలో దూసుకు వెళ్తున్నారని, అయినప్పటికీ ఇవేవీ తెలియకుండా, కనీసం అవగాహన లేకుండా కాంగ్రెస్



నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. తమ నాయకుడు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసైన కాంగ్రెస్ నాయకులకు ఇప్పటికైనా కనువిప్పు కలగాలని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనా రాబోయే ఎన్నికల్లో తమ నాయకుడు భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని, దీనికై ఇప్పటికే పార్టీ నాయకులు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేస్తూ, చల్మెడ గెలుపు కొరకు కృషి చేస్తున్నారని, పార్టీలోని అందరి సహకారంతో ప్రజా దీవెనలు, ఆశీస్సులతో వేములవాడ గడ్డపై మరోసారి గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడ శ్రీనివాస్,మిడిదొడ్డి గంగరాజు,దుర్గం పర్శరాములు,మహ్మద్ పర్వేజ్,నేరెళ్ల రాజేశం గౌడ్,బొజ్జ శ్రీనివాస్,మిరియాల సంతోష్,జగన్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్ డే కార్యక్రమం




కరీంనగర్, ఆగస్టు 26 (మనం న్యూస్)ః జాన్సన్ గ్లోబల్ హై స్కూల్, కోరా హై స్కూల్ ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'రెడ్ డే 'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆనదోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ చిన్నపిల్లల్లో సమయస్ఫూర్తి , ఉత్తేజం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మహిపాల్ రెడ్డి, వరప్రసాద్, హరికృష్ణ, రామ్ రెడ్డి , సంతోష్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, ఉపాధ్యాయ బృందంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

26కెఎన్

## నిరుపేద కుటుంబానికి న్యాయవాది ఆపన్న హస్తం



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 26 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా మలకపేట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి న్యాయవాది తంగళ్ళపల్లి వెంకటి ఆపన్న హస్తం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి చెందిన కన్నం పోచమ్మ పది రోజుల క్రితం చనిపోవడంతో లా అసోసియేషన్ తరపున 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అనంతరం తంగళ్ళపల్లి వెంకటి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం కావడంతో బాధిత కుటుంబానికి అండగా నిలవడం జరిగిందన్నారు. కష్ట సమయాల్లో నిరుపేదలకు ఎల్లవేలలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కర్రోళ్ల శంకర్, బర్ల శ్రీనివాస్, పెద్ద బోనాల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పంగ రవి, ఎర్రోళ్ల శేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చెట్లతోనే మానవ మనుగడ

### ఎమ్మెల్యే దివాకర్ రావు

### ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో హరితహారం

లక్షెట్టిపేట్, ఆగష్టు26 (మనం న్యూస్): చెట్లతోనే మానవ మనుగడ అని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో హరితహారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు, విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కేసీఆర్ ముందు చూపుతో 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రం హరితహారం వలన పచ్చదనంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. బెంగళూరు లాంటి ప్రదేశాల్లో ఉండే చల్లని వాతావరణం నేడు తెలంగాణలో కనిపిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.అంతే కాకుండా ఎన్నో రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలతో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. మంచిర్యాల ప్రాంతాన్ని ప్రశాంతంగా ఉంచడమే తన ధ్యేయమని వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య మాట్లాడుతూ హరితహారం ఒక గొప్ప కార్యక్రమమని కొనియాడారు. చెట్లతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. అనంతరం వైస్ చైర్మన్ పోడేటీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు బహుమతిగా ఇవ్వడం మన బాధ్యత అని గుర్తు చేశారు. చెట్లతోనే మానవ మనుగడ అని వివరించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ ప్రతి ఏటా కళాశాల లో హరితహారం భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల లో విద్యార్థులకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ఓజా ఎమ్మెల్యే దివాకర్ రావు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య ను కోరగా త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కాంట్రాక్టు లెక్చరర్స్, గెస్ట్ లెక్చరర్స్, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న బీసీ హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజ్ కుమార్,కౌన్సిలర్లు ఒరగంటి శ్రీకాంత్, రాజన్న, మెట్టు కళ్యాణి రాజు, సురేష్ నాయక్, కో -ఆప్షన్ సాహిద్ అలీ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిన్నయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగయ్య, అధ్యాపకులు,అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



లక్షెట్టిపేట్, ఆగస్టు 26(మనం న్యూస్ ) : పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులతో పాటు అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు కు కళాశాల ఆవరణలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లెక్చరర్స్‌గా గత 20 ఏండ్లుగా సేవలందిస్తున్నామని, తమలో ఇప్పటికీ రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని, గెస్ట్ ఫ్యాకల్టీని ఆటో రెన్యువల్, కన్సాలిడేటెడ్ వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, వేతనాన్ని అందించాలని వినతిపత్రం లో పేర్కొన్నారు. అధ్యాపకుల, సిబ్బంది సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ లెక్చరర్స్ రాజ్ కుమార్, శ్రీనివాస్, సంధ్య, కవిత,మల్లయ్య,రాం చందర్, సంధ్య రాణి గెస్ట్ లెక్చరర్స్ మహేష్, సతీష్, రవీందర్ , సత్యనారాయణ, కుమార్, అపూర్వ, భవాని సౌజన్య , అరుణ, రాజలింగం, బోధనేతర సిబ్బంది పీ శ్రీనివాస్, సునీత, శ్రీలత, పింగళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా విజయ్



పెద్దపల్లి, ఆగస్టు 26 (మనం ప్రతినిధి): పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా పోగుల విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ క్లబ్ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని, క్లబ్ సభ్యులందరికీ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన అధ్యక్షులు చింతకింది చంద్రమౌళి ,ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్, కోశాధికారి బెజ్జంకి నరేష్ , తోటి జర్నలిస్టులకు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. విజయ్ ఎన్నిక పట్ల టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్, నాయకులు బిక్షపతి, సుదర్శన్, వినోద్, తిరుపతి రెడ్డి, పల్ల మహేష్, సుంక శ్రీధర్, జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్, నాయకులు వనపర్తి శ్రీనివాస్, సతీష్, శ్రీనివాస్, ఉదయ్‌లతో పాటు పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు

# క్యూఆర్ కోడ్ విధానం

### రామగుండం ట్రాఫిక్ ఏసిపి నరసింహులు

### అభయ యాప్ పై విద్యార్థులకు అవగాహన

గోదావరిఖని,ఆగస్టు 26 (మనం న్యూస్): ఆటో, టాక్సీ లలో ప్రయాణించే ప్రజల భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్, అభయ యాప్ విధానాన్ని తీసుకు వచ్చిందని రామగుండం ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. శనివారం గోదావరిఖని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులకు క్యూఆర్ కోడ్, అభయ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానం ద్వారా ప్రతి ఆటో,టాక్సీ లకు క్యూ ఆర్ కోడ్,యూనిక్ నెంబర్ ఇవ్వడం జరిగిందని, అందులో ఆటో యజమాని,డ్రైవర్ కి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు.ఆ వాహనం యొక్క పూర్తి వివరాలు స్థానిక పోలిస్ స్టేషన్ కి,కమాండ్ కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేయబడి ఉంటాయని, ఆటో లో డ్రైవర్ కి వెనుక భాగంలో క్యూ ఆర్ కోడ్,యూనిక్ నెంబర్ బోర్డు అమర్చడం జరుగుతుందన్నారు.స్మార్ట్ ఫోన్ ఉన్న వారు క్యూ ఆర్ కోడ్ స్కానర్ అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోవాలని, వాహనం ఎక్కే ముందు ప్రయాణికులు డిజిటల్ బోర్డ్ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేయగానే ఆటో






యజమాని,డ్రైవర్ యొక్క వివరాలు వస్తాయని అన్నారు.ఇందులో అత్యవసర కాల్, సందేశం పంపడం,కంప్లైంట్,రేటింగ్ అంశాలు ఉంటాయని,ప్రయాణికులకు ఆపద సంభవిస్తుంది అనుకునే సమయంలో కాల్ చేస్తే కమాండ్ కంట్రోల్ రూమ్ కి, స్థానిక పోలీస్ స్టేషన్ కి వారి లోకేషన్, సమాచారం వెళుతుందని,వెంటనే స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆపదలో ఉన్న వారిని రక్షించడం జరుగుతుందని వివరించారు.అంతేకాకుండా మద్యం సేవించి వాహనం నడిపిన,రాష్ డ్రైవింగ్ చేసిన, ప్రయాణికులతో దురుసుగా,అసభ్యకరంగా ప్రవర్తించిన,సెల్ ఫోన్ డ్రైవింగ్, స్మోకింగ్ చేస్తూ వాహనం నడిపిన, రాంగ్ రూట్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, అనుమానస్పదంగా వ్యవహరించే ఆకతాయి డ్రైవర్ల ఆటకట్టించవచ్చునని పేర్కొన్నారు. అలాగే ప్రయాణీకులు వారి వస్తువులను వాహనంలో మరిచిపోయిన ఈ విధానం ద్వారా సులభంగా తెలుసుకోవచ్చన్నారు. కావున మీరు క్యూఆర్ కోడ్, అభయ యాప్ పై మీ ఇంట్లో వారికి, మీ బంధువులకు, మిత్రులకు తెలియచేసి వారికి అవగాహన కల్పించాలని సూచించారు.రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు పోలీస్ అధికారులకు రాఖీ కట్టి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 56వ డివిజన్‌లో గడప గడపకు కాంగ్రెస్



కరీంనగర్,ఆగస్టు 26 (మనం న్యూస్): నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం యాభై ఆరవ డివిజన్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కలిసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. గడప గడపకు కరపత్రం అందే విధంగా నిరంతరం ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండి రవీందర్, గడ్డం విలాస్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,చర్ల పద్మ,మెతుకు కాంతయ్య,దన్న సింగ్,పోరండ్ల రమేష్,షబానా మహమ్మద్, నెల్లి నరేష్, లయక్, నిహల్ అహ్మద్,సుంకరి గణపతి,అన్నే జ్యోతి, మహాలక్ష్మి, స్వరూప,అశ్రఫ్ ఖురేషి, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్,బషీర్, సయ్యద్ ఖలీల్,షేక్ శేహెన్ష,కీర్తి కుమార్,మామిడి సత్యనారాయణ రెడ్డి,నయీం,అనిల్, నదిం,హనీఫ్,కమల్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి వృక్షార్చనలో పాల్గొన్న రసమయి



మానకొండూరు, ఆగస్టు 26 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జివి.రామకృష్ణారావుతో కలిసి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాడ్గుల రవీందర్ రెడ్డి, సర్పంచులు రాఘవ రెడ్డి, రొడ్డ పృథ్విరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు

## జిల్లా సహాయక బృందం ఆర్థిక సహాయం



మల్లాపూర్, ఆగస్టు 26 (మనం న్యూస్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం జగిత్యాల జిల్లా సహాయక బృందం సభ్యులు శనివారం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కళాశాలలో మినరల్ వాటర్ లేదన్న విషయాన్ని పలువురు విద్యార్థులు సహాయక బృందం సభ్యులకు సమాచారం అందించగా వారు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయక బృందం సభ్యులు గంగుల శ్రీనివాస్, నత్తి రాము, బైరి రాజ్ కుమార్, మినుగు నరేష్, వేములవాడ నితిన్ , మహేష్, గండికోట విక్రమ్, రాజు, రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ కాళీద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులుగా వంచ శ్రీనివాస్ రెడ్డి



కరీంనగర్, ఆగస్టు 26 (మనం న్యూస్): తెలుగు దేశం పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులుగా వంచ శ్రీనివాస్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియోజకవర్గ అధ్యక్షులుగా నియమితులు కావడం ఇది రెండో సారి. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనను మరోసారి నియమించినటిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఇంత పెద్ద గురు తర బాధ్యతలు నాకు అప్పగించినందుకు పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తూ పూర్వ వైభవం తేవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను తెలుగుదేశం పార్టీ ఒక ఛాలెంజ్ గా తీసుకుని అధికారంలోకి రావడానికి కింగ్ మేకర్ పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిలు, కో-ఆర్డినేటర్లు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పిఎసిఎస్ భవన నిర్మాణ అవకతవకలపై విచారణ చేపట్టాలి : పాలకవర్గ సభ్యులు



శంకరపట్నం, ఆగస్టు 26 (మనం న్యూస్): తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం నిర్మాణం సందర్భంగా జరుగుతోన్న అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు శనివారం జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ పలుసార్లు జరిగిన సమావేశాల్లో నూతన భవన నిర్మాణం విషయంలో లెక్కలు చూపించాలని కోరినప్పటికీ సహకార సంఘ చైర్మన్ కేతిరి మధుకర్ రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారన్నారు. ఈ భవన నిర్మాణంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భవన నిర్మాణం లెక్కలపై జిల్లా అధికారులు తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడికల్ ప్రాథమిక సహకార సంఘం ఉపాధ్యక్షులు నరహరి వెంకటరమణారెడ్డి, పాలకవర్గ సభ్యులు పోలాడి హనుమంతరావు, దొంగల రాములు, కల్వకుంట్ల సత్యనారాయణ, జూల శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీను, తిరుపతి సమ్మయ్య, స్వరూప పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

## గోదావరిఖని వన్ టౌన్ సీఐ ప్రమోద్ రావు

## బాపూజీ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



గోదావరిఖని,ఆగస్టు 26 (మనం న్యూస్)గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీ నగర్ లో శనివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.గోదావరిఖని వన్ టౌన్ సీఐలు ప్రమోద్ రావు,ప్రసాద్ రావులు తమ సిబ్బందితో కలిసి బాపూజీ నగర్ లో ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి,ఇళ్లను సోదాలు చేశారు.వాహన పత్రాలు సరిగా లేని 60 మోటార్ సైకిల్లు,7 ఆటోలు,6 ట్రాలీలను సీజ్ చేసి,జరిమానా విధించారు.ఈ సందర్భంగా సీఐ ప్రమోద్ రావు మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం,ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం తెలుసుకోవడం, నేరాల నిర్మూలనకై కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఎవరైనా కొత్త వ్యక్తులు ఇల్లు అద్దెకొరకు వస్తే వారి పూర్తి వివరాలు అడిగి వారి వద్ద నుండి ఆధార్ కార్డ్ తీసుకోవాలని, ఏమైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో,రక్షణగా ఉంటారని తెలిపారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని,ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ,సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మనకు తెలియనటువంటి నెంబర్ నుంచి వచ్చిన మెసేజ్లను,లింకును ఓపెన్ చేయొద్దు అని,లాటరీ వచ్చిందని, లోన్ వచ్చిందని,ఏదైనా గిఫ్ట్ లు వచ్చాయని అత్యాశకు పోయి వచ్చిన మెసేజ్లను ఓపెన్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ట్లయితే వెంటనే 1930 లేదా డయాల్ 100 కి కాల్ చేసి ఫిర్యాదు చెయ్యాలని తెలిపారు. ఎవరిదైనా మొబైల్ పోయిన, దొంగిలించబడిన సిఇఐఆర్ పోర్టల్ నందు తమ వివరాలను నమోదు చేసుకున్నచొ వారికి మొబైల్ దొరికే అవకాశం ఉన్నందున సిఇఐఆర్ పోర్టల్ ను వినియోగించుకోవాలని వివరించారు.మహిళలకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉన్నచో రామగుండం కమిషనరేట్ పరిధిలో గల షి టీం 6303923700 నెంబర్ కు ఫోన్ చేసినట్లయితే తక్షణ పరిష్కారం లభిస్తుందని సిఐ పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో సీఐ2, ప్రమోదరావు ప్రసాద్ రావు,ఎస్ఐలు స్వామి ,సుగుణాకర్, సౌజన్య ,శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా రమాకాంత్ జన్మదిన వేడుకలు

## - గోశాలలో పశుగ్రాసం, ఆకుకూరల వితరణ

## - వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



కరీంనగర్ లీగల్, ఆగస్టు 26 (మనం న్యూస్): శ్రీకాంత్ సేన సభ్యులు గోగుల కొండ రమాకాంత్ జన్మదిన వేడుకలు హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నగరంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక భవిత వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు మంకమ్మ తోటలో బ్రెడ్లు అందించారు. అనంతరం కట్టారాంపూర్ లోని గిద్దె పెరుమాండ్ల స్వామి దేవాలయ గోశాలలో పశుగ్రాసంతో పాటుగా వాటికి ఇష్టమైన ఆకుకూరలను అందించారు. ఈ సందర్భంగా బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజులు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోగులకొండ రమాకాంత్, కుంభాల మధు కుమార్, నెల్లి సందీప్ , వడ్ల తేజ, శ్రీకాంత్ సేన సభ్యులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కుంటుబాన్ని పరామర్శించిన ఎంపిపి



ఇల్లంతకుంట, ఆగస్టు 26 ( మనం న్యూస్ ): గాలిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ అయ్యన్న గారి లింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంకుంట నరేందర్ రెడ్డి,సామరాజీరెడ్డి, కేశవేని శ్రీనివాస్, చిట్టి ప్రదీప్ రెడ్డి,సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కరించాలని ఆశా వర్కర్‌ల ధర్నా



మల్లాపూర్, ఆగస్టు 26 (మనం న్యూస్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆశావర్కర్లు మాట్లాడుతూ సరైన సమయపాలన లేకుండా నిత్యం విధుల్లో సతమతమవుతోన్న ఆశా వర్కర్లకు సరైన వేతనాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తమ వేతనాలను పెంచాలని 18వేల కనీస వేతనాన్ని ప్రతి ఆశావర్కర్‌కు అందించాలని డిమాండ్ చేశారు. తమకు నిర్దేశించిన విధులే కాకుండా ఇతర పనులు చేయించే విధానాన్ని మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని

# తహసీల్దార్‌కు వినతి పత్రం



ఇల్లంతకుంట, ఆగస్టు 26 (మనం న్యూస్): తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సొల్లు శాంత ఆధ్వర్యంలో ఆశావర్కర్లు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శాంత మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఆశాలపై అదనపు పనిభారాన్ని మోపరాదని డిమాండ్ చేశారు. తక్షణమే జాబ్ చార్టును విడుదల చేయడంతో పాటు 2021 జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలల పిఆర్సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలలకు సంబంధించిన బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆశావర్కర్లందరికీ సాధారణ బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి హెల్త్ కార్డులు అందించాలని, జిల్లాలో ఆశాలకు తొలగించిన అన్ని రకాల పెన్షన్లు పునరుద్ధరించడంతో పాటు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. తమ డిమాండ్లకు వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు కె.కస్తూరి, మండల కమిటీ నాయకులు లక్ష్మి, అరుణ, సుజాత, మల్లగళ్ళ ఏసుమణి , సంతోష, ఎల్లవ్వ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో హరిత హారం

హుజురాబాద్ రూరల్, ఆగస్టు 26 (మనం న్యూస్): హరిత హారం కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ గంధె రాధిక ఆధ్వర్యంలో పట్టణంలోని కెసి క్యాంపులోకి ఎసిపి కార్యాలయం సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ కె. రాంమోహన్‌రాయ్, ఇంచార్జి మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సాంబరాజు, ఇంచార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ యం.కిషన్ రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.వినయ్, సానిటరీ జవాన్లు, కార్యాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు



సిర్పూర్(టీ) ఆగస్టు26( మనం న్యూస్): భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు 1000 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్మశాన వాటిక ఆవరణలో ఎఫ్ఆర్వో పూర్ణచంద్రరావు, సర్పంచ్ తఫిమా పర్విన్, ఎంపిడివో రాజేశ్వర్, ఎస్ఐ దీకొండ రమేశ్‌లు మొక్కలు నాటారు. అదే విధంగా డోర్పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపిపి చునార్కర్ సువర్ణ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో కృష్ణమూర్తి, మరియు పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్



మెట్‌పల్లి ,ఆగస్టు 26 ( మనం న్యూస్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వారి ఆధ్వర్యంలో12.వార్డు లోని అర్బన్ కాలనీ లో శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కల్వ కుంట్ల విద్యాసాగర్ రావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ దశాబ్దం పూర్తి చేసుకున్న సందర్భం గా వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమం మున్సిపల్ అర్బన్ లోశనివా రం ప్రారంభించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా అత్యధికంగా పండ్ల మొక్కలు నాటాలని, పట్టణ శివారు ప్రాంతాల్లో కూడా మొక్క లు పెంచడం జరుగుతుందని తెలంగాణకు హరితహార తెలంగాణగా పేరు రావాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని దశాబ్దం నుండి నాటే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానవేణి సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్ రావు,మున్సిపల్ కమీషనర్ జగదీశ్వర్గౌడ్, కౌన్సిలర్ లు,ఆర్పీలు, మున్సిపల్ అధికారులు,పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ధాతృత్వం చాటుకున్న ఉదయ్‌నందన్‌రెడ్డి



వీణవంక-ఆగష్టు26 (మనం న్యూస్): మండలంలోని బొంతుపల్లి గ్రామంలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాధలైన శ్రీరాముల రమ్య,శ్రీరాముల రాజ్‌కుమార్ ల ఆర్ధిక స్థితిగతులను గ్రామ మాజీ సర్పంచ్ మహంకాళి రాజ్‌కుమార్ యుప్‌టీవీ అధినేత పాడి ఉదయ్ నందన్‌రెడ్డికి వివరించగా తక్షణమే మానవతావాదంతో స్పందించి వారికి తన అనుచరులతో 10వేల రూపాయల ఆర్ధిక సహాయం శనివారం అందజేశారు. అదేవిధంగా రాజ్‌కుమార్‌యొక్క ఉన్నచదువు ల కోసం ప్రతి నెల వెయ్యిరూపాయలను సహాయంగా స్కాలర్‌షిప్‌ను అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చదువు శంకర్‌రెడ్డి, అమృత ప్రభాకర్, చిట్టి, దాసారపు లోకేష్, పస్తుం కుమార్, ప్రశాంత్, అఖిల్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములపేటలో హరితహారం



వీణవంక-ఆగష్టు26(మనం న్యూస్): మండలంలోని శ్రీరాములపేట గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామసర్పంచ్ కొల్లూరి సంధ్యబాపురావు లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయని ,నాటిన మొక్కలను సంరక్షించుకునే బాధ్యత గ్రామస్తులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి వీరప్రతాప్, ఫీల్డ్‌అసిస్టెంట్ సరిత తదితరులు పాల్గొన్నారు.






## బిజేపి రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుల నియామకం

వీణవంక-ఆగష్టు26(మనంన్యూస్): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి విద్యాసాగర్‌రెడ్డి, మామిడాల పల్లి గ్రామానికి చెందిన పుప్పాల రఘు లను భారతీయజ నతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులుగా నియమించినట్లు పార్టీ రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకం పట్ల మండల బిజేపి నాయకులు ,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తమ నియామ కానికిసహకరించిన పార్టీ పెద్దలందిరికి ధన్యవాదాలు తెలిపారు.

## పచ్చదనంతో పట్టణాలు, పల్లెలు కళకళలాడాలి

### మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు



జమ్మికుంట, ఆగస్టు 26 (మనం న్యూస్): పచ్చదనంతో పట్టణాలు, పల్లెలు కళకళలాడాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళ పల్లి రాజేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒక్కరోజు ఒక కోటి మొక్కలు నాటే కార్యక్ర మంలో భాగంగా మోత్కుల గూడెం శివారులో శనివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానలు కురవాలన్నా, ప్రాణవాయువు కావాలన్నా పల్లెలలో పట్టణాల్లో పచ్చదనం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని ప్రతి ఇంటికి ప్రభుత్వం సరఫరా చేసిన ఆరు మొక్కలు నాటుకోవాలని సూచించారు. వాటిని సంరక్షించి పచ్చదనం గ్రామాలలో కొనసాగేలా చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి శ్రీనివాస్,మేనేజర్ భూపాల్ రెడ్డి ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, సదానందం,కార్యాలయ సిబ్బంది, సిఎల్ఆర్ పి, ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో బండి సంజయ్



వేములవాడ టౌన్, ఆగస్ట్ 26 (మనం న్యూస్): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్‌కుమార్, బిజెపి ఎమ్మెల్యేలతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం ఆనంతరం కళ్యాణమండపంలో సంజయ్, కరీంనగర్ పార్టీ ఎన్నికల చొప్పదండి ఇంచార్జ్, ఎమ్మెల్యే సికె.రామ్ మూర్తి, పార్టీ ఎన్నికల మానకొండూర్ ఇంచార్జ్ బస్వరాజ్ మట్టిముడ్, హుజూరాబాద్ ఇంచార్జీ దిగంత కలిత, హుస్నాబాద్ ఇంచార్జీ కొన్వర్, శశాంక్ త్రివేదిలకు ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతి రావు కండువాలు కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు.

## అభివృద్ధి, సంక్షేమమే బిఆర్‌ఎస్ ప్రభుత్వ అజెండా

### సర్పంచ్ జలేందర్‌రెడ్డి

### కెసిఆర్, కొప్పుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



వెల్గటూర్, ఆగస్టు 26(మనం న్యూస్): అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా బిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి పేర్కొన్నారు. నూతన ఎండపల్లి మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం పై హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ జలేందర్ రెడ్డి ఆద్వర్యంలో స్థానిక బీఆర్ ఎస్ నాయకులతో కలిసి సిఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి, ఎండపల్లి పిఎసిఎస్ చైర్మన్ గూడా రామ్ రెడ్డి, బీఆర్ఎస్ ఎండపల్లి మండల అధ్యక్షులు సింహాచలం జగన్, రైతు విభాగం మండల అధ్యక్షులు మారం జగన్మోహన్ రెడ్డి, ఎండపల్లి ఉపసర్పంచ్ మైలారం సతీష్, వార్డు సభ్యులు సంపతి సతీష్, బుసన్నవేని జమున,పొట్లపల్లి సత్యనారాయణ రావు, బూరగడ లక్ష్మి, మంతెన మహేష్ , ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు సిఏలు,భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి రాజకీయ శంఖారావం వాల్ పోస్టర్ విడుదల



రామకృష్ణాపూర్,ఆగష్టు 26 (మనం న్యూస్): అఖిల భారత పద్మశాలి సంఘం,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్తంగా సెప్టెంబర్ 3వ తేదీన సరూర్ నగర్ స్టేడియం హైదరాబాద్లో నిర్వహిస్తున్న పద్మశాలి రాజకీయ శంఖారావం వాల్ పోస్టర్లను రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీలక్ష్మి గణేష్ మండపం వద్ద ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, మంచి ర్యాల జిల్లా అధ్యక్షులు గాదాసు బాపు మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయం గా,ఆర్థికంగా మరింత ఎదగాలని కలిసికట్టుగా మెరుగైన సమాజం కోసం ఉద్యమించాలని అన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా పద్మశాలీలు రాజకీయ అస్థిత్వాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి, రాజకీయంగా ఎదగడానికి అందరు చైతన్య వంతులై కదం తొక్కాల్సిన అవసరం ఉందన్నారు.మన ఓటు మన సీటు, మన వాటా ప్రకారం పద్మశాలీలకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని వివిధ పార్టీలకు అల్టిమేటం జారీ చేయనున్నట్లు తెలిపారు.పద్మశాలి సమాజం కోసం ఉద్యమించిన కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పద్మశాలీలకు,చేనేత కార్మికులకు ప్రభుత్వ తరపున రావల్సిన సంక్షేమ పథకాలను వెంటనే అందివ్వాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు గడ్డం సుధాకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవసాని నాగరాజు, జిల్లా కార్యదర్శి నల్ల రవి,రామకృష్ణాపూర్ పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు తిరుపతి,కోశాధికారి వేముల వెంకటేశం,స్టీరింగ్ కమిటీ సభ్యులు సాంబారి వెంకటస్వామి,ఆడెపు లక్ష్మన్,ఉపాధ్యక్షులు ఆడెపు కృష్ణ కుమార్,కనుకుంట్ల సమ్మయ్య,వేముల హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కెసిఆర్ లక్ష్యం



### - పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలి

### : ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చిగురుమామిడి, ఆగస్టు 26 (మనం న్యూస్)ః గ్రామాల సమగ్రాభివృద్ధే ముఖ్యమంత్రి కెసిఆర్ లక్ష్యమని, ఆ దిశగానే రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం నిత్యం పాటుపడుతోందని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికి తాగునీరే ఎజెండాగా బిఆర్ ఎస్ ముందుకుసాగుతోందన్నారు. తెలంగాణలో మౌళిక వసతుల కల్పనకు కెసిఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసి గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. శనివారం చిగురు మామిడి మండలంలో 9కోట్ల44లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండాపూర్ గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, సుందరగిరి నుండి ఉల్లంపల్లి గ్రామం వరకు రూ.2 కోట్ల 25లక్షల వ్యయంతో బిటి రోడ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కోహెడ ఆర్‌బి రోడ్ నుండి ముదిమాణిక్యం గ్రామం వరకు రూ.1కోటి 50లక్షల వ్యయంతో బీటీ రోడ్ నిర్మాణ పనులు, చిగురుమామిడి ఆర్‌బి రోడ్ నుండి ముదిమాణిక్యం వయా అర్కాలపల్లి గ్రామం వరకు రూ.1కోటి 9.5లక్షల వ్యయంతో బీటీ రోడ్ నిర్మాణం, మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ ం, రేకొండ గ్రామం నుండి ఎక్లాస్ పూర్ వరకు రూ.2 కోట్ల 10లక్షల వ్యయంతో బ్రిడ్జ్‌తో పాటు బీటీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని 17 గ్రామాలకు స్పోర్ట్స్ కిట్లు, క్రికెట్ కిట్లు, టీ షర్ట్‌లు, డంబుల్ సెట్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎనిమది మంది లబ్ధిదారులకు లక్షా 69 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలానికి పలు అభివద్ధి పనుల కోసం మరో ఎనిమిది కోట్ల రూపాయలు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామలలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, మరుగు దొడ్లను ప్రభుత్వం నిర్మిస్తోందని ప్రతి గ్రామ అభివృద్ధికి నెల నెల ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలోనే ఉన్నాయని తెలిపారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు గ్రామాలలో సామాజిక భవనాలు, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పౌరునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పల్లెలు ఎంతో వెనుకబాటులో ఉండేవని,స్వరాష్టం సాధించిన తర్వాత బంగారు తెలంగాణ లక్ష్యం గా సాగుతున్న కేసీఆర్ పాలన లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధిని సాధిస్తున్నాయని, నాటి సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో ఎంతో వెనుకబాటుకు గురయ్యామని, తెలంగా ణ రాష్ట్ర అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలే పట్టుకొమ్మలని, ప్రజలంతా కలిసిక ట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు గీకురురవీందర్, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణ రెడ్డి, వాయిస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, ఎంపీడీవో ఎం నరసయ్య, స్థానిక సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, పెద్దపల్లి భవాని అరుణ్ కుమార్, శ్రీముర్తి రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఎంపిటిసి సభ్యులు సింగిల్ విండో డైరెక్టర్లు, పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై వెంటనే కేసులు నమోదు చేయాలి

### కరీంనగర్ సిపి సుబ్బారాయుడు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 (మనం న్యూస్)ః సైబర్ నేరాలు జరిగిన వెంటనే కేసులను నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు పోలీస్ అధికారులను ఆదేశించారు. వెంటనే కేసులు నమోదు చేయడం ద్వారా సైబర్ నేరాల ద్వారా దొంగిలించబడ్డ డబ్బుల లావాదేవీలను నిలుపుదల చేసి బాధితులకు అందజేసే అవకాశం ఉంటుందని చెప్పారు. శనివారం కరీంనగర్ కమిషనరెట్ కేంద్రంలో పోలీసుల నెలవారి నేరసమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయాలని చెప్పారు. శాంతిభద్రలకు సంబంధించి ఎలాంటి సమాచారం అందిన సత్వరం స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని సేవలందించాలని తెలిపారు. పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని చెప్పారు ప్రధానంగా ప్రధాన కూడళ్ళల్లోని కెమెరాలు పనిచేసే విధంగా చూసుకోవాలని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సీసీ కెమెరాలు పనితీరును సమీక్షించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిసిన సీసీ కెమెరాలు ప్రతిరోజు పనిచేసే విధంగా చూసుకోవాలని చెప్పారు. సాంకేతిక కారణాలతో పని చేయకపోయినట్లయితే కమీషనరేట్ కేంద్రానికి వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. వివిధ రకాల కేసుల చేదన కోసం ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రతి కేసు వివరాలపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలతో అక్రమ కార్యకలాపాలు నియంత్రణలోకి వస్తాయని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడినవారిని సంబంధిత అధికారుల ఎదుట బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల పరిష్కారం కోసం ఇరువర్గాలను సంప్రదించాలని తెలిపారు.కొన్ని సున్నితమైన కేసుల నమోదు విషయంలో న్యాయ నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఈ నెలలో కమిషనరేట్ వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన సిసిఎస్ కానిస్టేబుళ్ల గొర్రె తిరుపతి , టి కనకరాజు, లేక్ అవుట్ పోస్ట్‌కు చెందిన కానిస్టేబుల్ దరిపెల్లి సారయ్య, హోంగార్డ్ అంజనేయులు, ట్రాఫిక్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ గయాసొద్దీన్, కానిస్టేబుల్ హరికేశవ్ లను అభినందించి నగదు రివార్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు ఎ లక్ష్మినారాయణ, సి.రాజు, ట్రైనీ ఐపీఎస్ అధికారి గీత్ మహేష్ బాబా సాహెబ్, ఎసిపి లు నరేందర్, కరుణాకర్ రావు, విజయ్ కుమార్, సర్వర్ , శ్రీనివాస్, సి ప్రతాప్, కాశయ్య, జీవన్ రెడ్డి, మాధవి, ఎస్బిఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి కార్మికులకు ఈ నెలలోనైనా ఏరియర్స్ చెల్లింపులు జరిగేనా..?

మంచిర్యాల, ఆగస్ట్ 26 (మనం న్యూస్): సింగరేణి కార్మికులకు రావలసిన 23 నెలల 11 వ వేతన ఒప్పందం బకాయిల కోసం కార్మికులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఆగస్టు నెల జీతంతో పాటు బకాయిలు చెల్లించాలని కోల్ ఇండియా ఆదేశించినా సింగరేణి యాజమాన్యం చెల్లింపుల మాటపై ఇప్పటి వరకు స్పందించక పోవడంతో అసలు ఈనెల జీతం తో వస్తాయా? రావా? అనే విషయమై కార్మికుల్లో ఆందోళన నెలకొంది. తెలంగాణా సింగరేణి కార్మికులు అంటే ఒక ప్రత్యేకత. తెలంగాణ ఉద్యమం లో వీరి పాత్ర మరువలేనిది. 1956 లో సింగరేణి కాల రీస్ కంపెనీ లిమిటెడ్ గా మారిన సింగరేణి తెలంగాణా రాష్టానికే కాదు దేశానికే వెన్నెముకగా ప్రజ్వరిల్లుతోంది. రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్న గొప్ప కంపెనీ సింగరేణి. ప్రతి ఏడాది అనుకున్న లక్ష్యాలు సాధించడం లో కార్మికుల కష్టం అంతా ఇంతా కాదు. ఇటీవల జాతీయ సంఘాలు అన్ని కలసి కోల్ ఇండియా పరిధి లో ఉన్న బొగ్గు గని కార్మికుల కోసం ప్రతి 5 ఏళ్లకు జరిగే వేతన సవరణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1 జులై,2021 నుంచి 30 జూన్,2026 వరకు ఈ 11వ వేతన ఒప్పందం అమల్లో ఉంటుంది. సింగరేణి లో పెరిగిన ఈ వేతన ఒప్పందాన్ని జూన్,2023 నుంచి అమలు పరచింది. ప్రతి కార్మికునికి జులై 2021 నుంచి మే,2023 వరకు పెరిగిన వేతన బకాయిలు యాజమాన్యం చెల్లించాలి. కోల్ ఇండియా పరిధిలో ఉన్న ప్రతి బొగ్గు సంస్థ ఆగస్టు,2023 జీతం తో పాటు 11 వ వేతన బకాయిలను కూడా చెల్లిచాలని సర్క్యులర్ జారీ చేసింది. కానీ సింగరేణి లో వీటి చెల్లింపుల విషయంలో ఇంతవరకు సర్క్యులర్ జారీ కాలేదు. వెంటనే సర్క్యులర్ జారీ చేసి వేతన బకాయిలను చెల్లించాలని కార్మికులు సింగరేణి యాజమాన్ని కోరుతున్నారు. పెరిగిన బేసిక్, ఇతర అలావెన్స్ లు, ప్రావిడెంట్ పండ్, ఇతర అన్ని కలిపి 3 నుంచి 8 లక్షల వరకు ఏరియర్స్ తమకు వస్తాయని కార్మికులు లెక్కలు వేసుకుంటున్నారు. చెల్లిపుల విషయంలో ముఖ్యమంత్రి, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లు త్వరగా నిర్ణయం తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

**: సర్క్యులర్ వెంటనే జారీ చేయాలిః**
**మంద నర్సింగారావు, సిఐటియు. ప్రధాన కార్యదర్శి.**

సింగరేణి యాజమాన్యం వెంటనే సర్క్యులర్ జారీ చేసి ఈ నెల వేతనం తో పాటు ఏరియర్స్ కూడా చెల్లించాలని నర్సింగరావు డిమాండ్ చేశారు. కోల్ ఇండియా ఇచ్చిన సర్క్యులర్ పై ఇంతవరకు స్పందన లేదన్నారు. సర్క్యులర్ ఇచ్చి దాదాపు 20 రోజులకు పైగా కావస్తున్నా 23 నెలల ఏరియర్స్ చెల్లింపుల విషయంలో ఎందుకు యాజమాన్యం తాత్సారం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. వెంటనే సర్క్యులర్ జారీ చేసి ఈనెల వేతనాలతో పాటు ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ 11 వ వేతన ఒప్పందం కాలం లో రిటైర్డ్ అయినా వారికి కూడ త్వరగా చెల్లించేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు.



# ప్రజా వ్యతిరేక కుటుంబ పాలనను అంతం చేయాలి

### : అస్సాం బిజెపి శాసనసభ్యులు ధర్మేశ్వర్ కొన్వర్

ఇల్లందకుంట, ఆగస్టు 26 (మనం న్యూస్)ః రాబోయే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోన్న బిఆర్ఎస్ పార్టీని ఓడించి, తెలంగాణలో నిరంకుశ కుటుంబ పాలనను అంతం చేయాలని అస్సాం రాష్ట్ర కోనారి శాసనసభ సభ్యులు ధర్మేశ్వర్ కొన్వర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాసీ యోజన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం బిజెపి మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్న కొన్వర్, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని శేష వస్త్రాన్ని అర్చకులు ఆయనకు అందజేసి స్వామివారి ఆశీర్వచనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మేశ్వర్ మాట్లాడుతూ బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిఆర్ఎస్ పార్టీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఇస్తున్న నిధులను కెసిఆర్ ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసే విధంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పుప్పాల రఘు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, మండల సంస్థాగత ఇంఛార్జి బింగి కరుణాకర్, నాయకులు అరెల్లి జోష్ణ శ్రీనివాస్, అంతం ఎల్లారెడ్డి, శీలం శ్రీనివాస్, ఎండి.షఫీ ఖాన్, కంకణాల రవీందర్ రెడ్డి, మడ్డి శ్రీనివాస్, కందాల రాజేందర్, అబ్బిడి తిరుపతి రెడ్డి. మట్ట పవన్ రెడ్డి,గుత్తికొండ రాంబాబు,ఎండీ. రియాజ్.కొత్త శ్రీనివాస్, మురహారిశంకర్,బండి రాజు,చిపతి శ్రీకాంత్ గౌడ్,కమ్మగోని అజయ్ బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిజామాబాద్
# కామారెడ్డి

## ఈనెల 29న జాబ్ మేళా

### జాబ్ మేళా కర పత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి



నిజామాబాద్ రూరల్ ఆగస్టు 26 (మనం న్యూస్): ఈనెల 29వ రోజున నిజామాబాద్ జిల్లా లోకల్ యూత్ మెగా జాబ్ మేళా ఎమ్మెల్సీకల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్లను టిఎస్ ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈనెల 29వ రోజున నిజామాబాద్ జిల్లా లో భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో లోకల్ యూత్ మెగా జాబ్ మేళా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ వేదికగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న యువకులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ కెసిఆర్ సేవాదళ్ కన్వీనర్ దేవేందర్ ఏడు మండలాలకు చెందిన స్థానిక ఎంపీపీలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్యంగా బీసీ కుల వృత్తుల లబ్ధిదారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 26 (మనం న్యూస్): ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు అవకాశం కల్పిస్తూ పోలింగ్ బూత్ ల పరిధిలో ఈ నెల 26, 27 తేదీలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం పలు పోలింగ్ బూత్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోస్రా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. బీ.ఎల్.ఓ లు, ఎన్నికల అధికారులు అందుబాటులో ఉన్నారా ? అని ఆరా తీశారు. వారి వద్ద గల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పుల వివరాలను పరిశీలించారు. ప్రత్యేక శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. మృతి చెందిన ఓటర్లకు సంబంధించి వారి కుటుంబ సభ్యులను సంప్రదించి మరణ ధ్రువీకరణ పత్రం సేకరించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే జాబితా నుండి పేరు తొలగించాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### పేద విద్యార్థుల భవిష్యత్తు కోసమే

# మైనార్టీ పాఠశాల

### దేశంలో ఎక్కడా లేనివిధంగా మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్య

### స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 26 (మనం న్యూస్): పేదింటి మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తు కోసమే మైనార్టీ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో 6.70 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 'తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల భవనాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్‌అలీతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్పీకర్ పోచారం మాట్లాడుతూ 2014 వరకు తెలంగాణ రాష్ట్రంలో 230 గురుకులాలు ఉంటే, 1016 కు పెంచినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఏడు మైనారిటీ గురుకుల పాఠశాలలను 204 వరకు పెంచినట్లు తెలిపారు. మొత్తం లక్షా నలభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, గురుకుల పాఠశాలలో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. పేదింటి పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. దీంతో మైనార్టీ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన సూచించారు. ఇంటర్ చదివిన విద్యార్థులు డిగ్రీ కూడా ఇక్కడే చదవడానికి వీలుగా బాన్సువాడ కు ఉర్దూ డిగ్రీ కాలేజీ మంజూరు అయిందని తెలిపారు. విద్యార్థులకు చదువే ఆస్తి, ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారికి మంచి అవకాశాలు ఉంటాయనీ ఆయన తెలిపారు. బాన్సువాడలో కట్టించిన వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్ళలో 430 ఇళ్ళను ముస్లిం మైనారిటీలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. హోం మినిస్టర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూలుకు ధీటుగా మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు చదువుతున్నారన్నారు. పేద మైనారిటీ ఆడబిడ్డల పెళ్ళికి షాదీముబారక్ ద్వారా నగదు సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. గంగా జమున తెహజీబ్ లాగా అందరూ కలిసి ఉండాలనీ ఆయన సూచించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి లాగా అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరన్నారు. నూతన సచివాలయంలో దేవాలయం, మజీద్, చర్చి లను నిర్మించి అందరూ సమానమే అని తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాల భవనాలు అత్యాధునిక వసతులు, అన్ని సదుపాయాలతో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో 17 మైనారిటీ స్కూల్స్, కాలేజీస్, మరో రెండు కళాశాలలు కలుపుకుని మొత్తం 19 విద్యా సంస్థలలో 7200 మంది విద్యార్థినీ విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ కింద 9 కోట్ల 48 లక్షల రూపాయలను మంజూరు చేసిందని వివరించారు. అంతేకాకుండా విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా ఆరుగురు మైనార్టీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కీం కింద 20.60 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించిందని కలెక్టర్ తెలిపారు. మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అర్హులైన వారికి గ్రాంట్ రూపంలో లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందన్నారు. ఇదివరకు బ్యాంక్ కాన్సెంట్ తో లబ్ధిదారులు తమవంతు వాటాను చెల్లిస్తే, సబ్సిడీ రూపంలో అర్హులకు రుణం మంజూరయ్యేదని గుర్తు చేశారు. ప్రస్తుతం నేరుగా ప్రభుత్వం లబ్దిదారులకు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కమీషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్, ఉర్దూ ఆకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీఉల్లా ఖాన్, నిజామాబాద్ జిల్లా, కామారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్లు దాదన్నగారి విఠల్ రావు దఫేదార్ శోభా రాజు, జిల్లా కలెక్టర్ రాజీవ్ హనుమంతు, బోదన్ ఆర్డీవో రాజా గౌడ్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ షఫీఉల్లా, పోచారం సురేందర్ రెడ్డి , మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లా ఖాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీలోఫర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

### -జిల్లా ప్రజల పక్షాన నీలోఫర్ వైద్యుడికి కృతజ్ఞతలు

### -ప్రస్తుతం పాప క్షేమంగానే ఉంది.

### -పిల్లల శస్త్ర చికిత్స వైద్యుడు డాక్టర్ బాబురావు



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 26 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి గ్రామానికి చెందిన సలీం అని పేద కుటుంబంలో జన్మనిచ్చిన 'ఇక్రా'అనే రెండు మాసాల పాప తీవ్రమైన కడుపునొప్పితో బాధపడడం కుటుంబ సభ్యులకు ఆందోళనకు గురిచేసింది. పలు వైద్యుల వద్దకు చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు వెళ్తే చిట్టిలపై మందులు రాసి ఇచ్చి పంపించారు. రెండు మాసాలుగా ఎన్ని మందులు వాడినా పాప కడుపు నొప్పి తగ్గకపోవడంతో ఇక స్కానింగ్ చేయక తప్పదు అని స్కానింగ్ చేస్తే శరీరంలో ఉన్న చిన్న పేగు పెద్ద పేగు రెండు ఒకటి దానిపై ఒకటి మడతై ఉందని స్కానింగ్ లో తెలిసింది. ఎన్ని ఆస్పత్రులు పాపను పట్టుకొని కుటుంబ సభ్యులు పరుగులు తీసినప్పటికీ ఎక్కడ సరైన వైద్య అందక చివరి క్షణంలో హైదరాబాద్ లోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిలోఫర్ ఆసుపత్రిలోని శస్త్ర చికిత్స కు సంబంధించిన పిల్లల సర్జన్ వైద్యుడు డాక్టర్ బాబురావు పరీక్షించారు. ఈ ఇక్రా అనే రెండు మాసాల పాప కడుపులో ప్రేగులు ఒకదానిపై ఒకటి మడతై ఉందని కచ్చితంగా శాస్త్ర చికిత్స చేస్తేనే పాప బతుకుతుందని ఆ పిల్లల సర్జన్ వైద్యుడు డాక్టర్ బాబురావు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఎలాగైనా శాస్త్ర చికిత్స చేసి మా పాప ప్రాణాన్ని కాపాడాలని పాప తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు వైద్యుడికి విన్నవించుకున్నారు. ఆ వైద్యుడు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బి ఆర్ఎస్ విభాగం ఎస్సీ సెల్ కన్వీనర్ గా ఉన్న పాశం కుమార్ కు మంచి మిత్రుడు ఉండడంతో ఆ పాప తో పాటు కుటుంబ సభ్యులకి ఎంతో మేలు జరిగింది. ఇంతటి అరుదైన శాస్త్ర చికిత్స చేసిన నిలోఫర్ ఆస్పత్రి పిల్లల సర్జన్ వైద్యుడైన డాక్టర్ బాబురావు జిల్లా ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# తుది ఓటరు జాబితాలో పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదు

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 26 (మనం న్యూస్): తుది ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బిఎల్ఓ మొదలుకుని ఈఆర్ఓ స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఓటరు జాబితా పక్కాగా, పూర్తి పారదర్శకంగా రూపొందేలా అన్ని స్థాయిలలో పర్యవేక్షణ జరపాలని సూచించారు. జాబితాలో రెండేసి పేర్లు కలిగిన ఉన్నవారిని గుర్తించినట్లయితే, అలాంటివారికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. పక్షం రోజుల వరకు వివరణతో కూడిన సమాధానం రాకపోతే, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని ఇంటికి పంపించి విచారణ జరిపించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డూప్లికేట్, అనుమానాస్పద పేర్లు జాబితాలో ఉండకూడదని, ఇలాంటి వాటి వల్ల ఎన్నికల సందర్భంగా గందరగోళ పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉంటుందన్నారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలివుంటే ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సి.ఈ.ఓ సూచించారు. పేర్ల నమోదు, మార్పులు-చేర్పుల కోసం పోలింగ్ బూత్ ల వారీగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 - 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువత తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఈ మేరకు కళాశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, అర్హులైన వారందరిచే నిర్ణీత ఫారం-6 దరఖాస్తు చేయించాలని అన్నారు. జనాభా లెక్కల వివరాలకు అనుగుణంగా పద్దెనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు సెప్టెంబర్ 19 లోపు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టాలని సి.ఈ.ఓ సూచించారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించే సమయంలో నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని, క్షేత్ర స్థాయిలో పర్యటించి మరణ ధ్రువీకరణ పత్రం వంటి ఆధారాలను సేకరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల, సహాయ ఎన్నికల అధికారులు కూడా స్వయంగా క్షేత్ర స్థాయిలో పోలింగ్ స్టేషన్లను సందర్శించి సదుపాయాలను పరిశీలించాలని, ఏవైనా లోటుపాట్లను గమనిస్తే వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటదివెంట ఓటరు గుర్తింపు కార్డు అందించేందుకు చొరవ చూపాలని, తమకు గుర్తింపు కార్డు అందాలేదంటూ ఏ ఒక్కరి నుండి సైతం ఫిర్యాదు రాకూడదని సూచించారు. పోస్టల్ శాఖ ద్వారా పంపిస్తున్న ఓటరు ఐ.డీ లు సకాలంలో, సంబంధిత ఓటర్లకు చేరుతున్నాయా? లేదా? అన్నది పర్యవేక్షణ జరపాలన్నారు. కాగా, ఏదైనా పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్యలో రెండు శాతానికి మించి పేర్లు తొలగింపు జరిగితే, ఈ.ఆర్.ఓలు తామే జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు ముందే జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, నూటికినూరు శాతం జాబితా పక్కాగా ఉండాలని సి.ఈ.ఓ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు పి.యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్ డీపీఓ సింహాచలం, ఈ.ఆర్.ఓలు, సహాయ ఈ.ఆర్.ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితతో ఎమ్మెల్యే షకీల్ మర్యాద పూర్వక భేటీ



బోధన్ ఆగస్టు 26,(మనం న్యూస్) త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికల్లో బోధన్ నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్యే షకీల్ శనివారం నిజామాబాద్ ఎమ్మెల్సి కల్వకుంట్ల కవితను హైదరాబాద్ లో ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## వాణి విద్యా నికేతన్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

### తెలంగాణ విద్యార్థి పరిషత్




బోధన్ ఆగస్టు 26(మనం న్యూస్) ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బోధన్ పట్టణం శక్కర్ నగర్లోని వాణి విద్యానికేతన్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ ఎంఈఓ నాగనాథ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాల నగేష్ మాట్లాడుతూ వాణి విద్యానికేతన్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకుండా, కనీసం విద్యార్థులకు తరగతి గదులు సరి అయినవి లేకుండా రేకుల షెడ్డులో విద్యా బోధన సాగిస్తున్న వాణి విద్యానికేతన్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని లేని పక్షంలో టీజీవిపి ఆధ్వర్యంలో పాఠశాల గుర్తింపు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాధవ్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రజకులు రిజర్వేషన్ కోసం పోరాటం

## నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్




నిజామాబాద్ ఆగస్టు 26 (మనం న్యూస్): రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం ఆగదని, రజకులు అందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకై ముందుకెళ్లాలని నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ అన్నారు. ఎస్, సి రిజర్వేషన్ ఇచ్చిన పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రజక సంఘం జిల్లా సమావేశానికి నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రజక సంఘం టౌన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రజక సంఘం టౌన్ అధ్యక్షుడిగా కనక రాజు, కార్యదర్శిగా శ్యామ్ సింగ్, కోశాధికారి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, చిన్న సాయిలు, శివ కుమార్, రూపేష్, అశోక్, సహాయ కార్యదర్శులుగా విజయ్, శంకర్, గంగరాజు, శంకర్ సింగ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.అనంతరం నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ మాట్లాడుతూ.. 17 రాష్ట్రాల్లో రజకులకు ఎస్ సి రిజర్వేషన్ ఇచ్చారని, కేవలం 11రాష్ట్రాల్లో బీసీలుగా చేర్చారన్నారు. తెలంగాణలో నైజాం పాలన ఉండడంతో ఎస్ సి లుగా చేర్చలేక పోయారన్నారు. మిగితా కులాలకు తాము వ్యతిరేకం కాదని, వారి రిజర్వేషన్ 15 శాతం అట్లాగే ఉంచి తమకు అదనంగా రెండు శాతం కలిపి 17శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంటరాని బట్టలు ఉతుకుతున్న తమ కులస్తులకు ఎస్ సి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ సి రిజర్వేషన్ ఇచ్చిన పార్టీకే తాము మద్దతు ఇస్తామన్నారు. ఎలక్షన్ కోడ్ రాక ముందు కేంద్రానికి సిఫారస్ చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు వర్సపల్లి నర్సింహులు రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాని, రాష్ట్ర కార్యదర్శి భూమేష్, యూట్యూబ్ ప్రధాన కార్యదర్శి యూత్ ప్రధాన కార్యదర్శి సాయి, యూత్ ఉపాధ్యక్షులు రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ పోశెట్టి, రజక కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.




# డాక్టర్ మధు శేఖర్‌ను సన్మానించడం మా అదృష్టం

## ఏఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు అంగారి ప్రదీప్ కుమార్

ఆర్మూర్ ఆగస్టు 26 (మనం న్యూస్): ఛైర్మన్‌గా నియమితులైన డాక్టర్ మధు శేఖర్‌కు సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామని ఏఎంఏఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంగారి ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం ఆర్మూర్‌లోఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఛైర్మన్ డాక్టర్ మధు శేఖర్ ని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ మాట్లాడుతూడాక్టర్ మధుశేఖర్ అంటరాని గుడిసె నుండి అఖిల భారత స్థాయి లో గొప్ప పేరును సంపాదించుకున్న సర్జన్ అని ఆర్మూర్ డివిజన్ లో చేయూత స్వచ్ఛంద సంస్థ ను ఏర్పాటు చేసి ఉచితంగా పేదప్రజాలకు సర్జరీలు, మందులు అందించి ఆరోగ్యదాత గా నిలిచారన్నారు,చదువుల్లో మంచి ప్రతిభ కనబరుస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల పాలిట చదువుల దాతగా ఏంతో మందికి తోడ్పాటు అందించారని,అటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో, ఇటు సామాజిక ఉద్యమాల్లో డాక్టర్ మధుశేఖర్ పాత్ర మారువరానిదని తెలిపారు.

# పూర్తి స్థాయిలో రైతుబంధు అమలు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేంకటేశ్వరరావు



బోధన్ ఆగస్టు 26,(మనం న్యూస్)ః రైతును రాజును చేయాలనే సంకల్పంతో కెసిఆర్ అమలుచేస్తోన్న రైతుబంధు పథకం పూర్తి స్థాయిలో అమలవుతున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో ఈ ఖరీఫ్ సీజన్లో 55వేల725 మంది రైతులకు సుమారు 54 కోట్ల రూపాయల రైతు బంధు మొత్తాన్ని అందజేశామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని అన్నదాతలు రైతు బంధు అందుకున్నారన్నారు. నియోజక వర్గంలో 12 శాతం ఎస్సి రైతులు, 14శాతం ఎస్టీ రైతులు, 52 శాతం బిసి రైతులు రైతు బంధు పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. మొట్ట మొదటిసారి 5.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులో ఉన్న పోడు రైతులకు 294.80 కోట్ల రూపాయల రైతుబంధును అందజేసినట్లు దేశాయ్ తెలిపారు.